క్లుప్తంగా...

నేడు రిలే నిరాహార దీక్ష

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశ పెట్టి న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మునిరాతి అరుణ్‌కుమార్ మాదిగ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 12న రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నామన్నారు. మంగళవారం ఉదయం రాజేంద్రనగర్ బుద్వేల్ బాబు జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు నియోజకవర్గంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్ష చేపడుతున్నామన్నారు.

ముగిసిన సిద్దులగుట్ట జాతర

శంషాబాద్: గత మూడ్రోజులుగా జరిగిన శ్రీవెండి కొండ (సిద్దులగుట్ట) జాతర మహోత్సవం సోమవారంతో ముగిసింది. చివరి రోజు మహాన్యాస రుద్రాభిషేకం, మహాబిల్వార్చన, వీరభద్రస్వామి అభిషేకం కార్యక్రమాలను నిర్వహించారు. పూజాది కార్యక్రమాల్లో ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి పలువురు ప్రముఖులు దర్శించుకుని పూజలు చేశారు.

- సిద్దులగుట్ట జాతరలో దశాబ్దాలుగా ఆచారంగా వస్తున్న అగ్నిగుండాల కార్యక్రమాన్ని చివరి రోజు తెల్లవారుజాము 4 గంటల సమయంలో నిర్వహించాల్సి ఉండగా ఈసారి ఉదయం 10 గంటల వరకు కూడా కార్యక్రమాన్ని నిర్వహించకపోవడంతో వందల సంఖ్యలో అక్కడి వచ్చిన భక్తులు తీవ్ర ఆగ్రహానికి గురయ్యారు. స్థానికంగా సమన్వయ లోపం కారణంగా అగ్నిగుండాల నిర్వహణ కార్యక్రమం ఆలస్యమైందని ఈఓ రామ్‌శర్మ పేర్కొన్నారు.

అక్రమ నిర్మాణంపై ఫిర్యాదు



వినతి పత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

శంషాబాద్: మున్సిపాలిటీలో జరుగుతున్న అక్రమ సెల్లార్ నిర్మాణాన్ని ఆపాలంటూ బీజేపీ నేతలు సోమవారం జిల్లా అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు ఫిర్యాదు చేశారు. జోషికుంట పక్కనే బఫర్ జోన్‌లో ఓ నిర్మాణం జరుగుతున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదన్నారు. వీటితో పాటు పట్టణంలో జరుగుతున్న బహుళ అంతస్తుల అక్రమ నిర్మాణాలకు కొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు అండగా నిలుస్తున్నారని ఆరోపించారు. సంబంధిత అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని మహేందర్, దేవేందర్, మహిపాల్‌రెడ్డి వినతిపత్రం ఇచ్చారు.

వేము వందనంకు అవార్డు

రాజేంద్రనగర్: ఆర్యణి సకల కళావేదిక సంస్థ గౌతమేశ్వర సాహితి కళాసేవ సంస్థ సంయుక్తంగా నిర్వహించిన జాతీయ స్థాయి కవితా పోటీల్లో రాజేంద్రనగర్‌కు చెందిన కవి వేము వందనం ప్రథమ బహుమతి సాధించారు. సోమవారం కరీంనగర్‌లోని ఫిలిం భవన్‌లో జరిగిన వేడుకల్లో అవార్డును ప్రదానం చేశారు.

ఏలోహిమ్ గాస్పెల్ చర్చిలో యూత్ మీటింగ్



నతానియేల్ దంపతులను సన్మానిస్తున్న సునీలశామ్యూల్

మైలార్‌దేవ్‌పల్లి: మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ దుర్గానగర్‌లోని ఏలోహిమ్ గాస్పెల్ చర్చిలో సోమవారం పాస్టర్ రెవరెండ్ సి.హెచ్.సునీల్‌శామ్యూల్, సిస్టర్ కస్తూరి ప్రసన్నల ఆధ్వర్యంలో నిర్వహించిన యూత్ మీటింగ్‌లో బుద్వేల్‌కు చెందిన రెవరెండ్ డాక్టర్ నతానియేల్ పాల్గొని బైబిల్ సందేశం ఇచ్చారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఉన్న క్రైస్తవ యువతను సన్మార్గంలో నడిపించడానికి, దేవుని ఆశీర్వాదాలు వారికి అనుగ్రహించేలా చూడడానికి ప్రతి నెల రెండవ ఆదివారం తమ చర్చిలో యూత్ మీటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్‌దేవరాజ్, విజయ్‌కుమార్, ఆనంద్ బాబు, ఎలియాజర్ అభిషేక్, యోహాను, దానియేల్, బాబి పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం

శేరిలింగంపల్లి: ఎంఎస్ఎమ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శేరిలింగంపల్లి గోపీనగర్‌లో సోమవారం కంటి వైద్యశిబిరాన్ని నిర్వహించారు. ఈ ఉచిత వైద్యశిబిరాన్ని ట్రస్ట్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే ఎం.భిక్షపతియాదవ్, సెక్రటరీ ఎం.రవికుమార్‌యాదవ్‌లు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్రదానం, విద్యాదానం, అన్నదానం, రక్తదానం చేయాలన్నారు. అవసరమైన వారికి కళ్ళద్దాలు అందజేశారు.కార్యక్రమంలో ఎల్లేష్, చంద్రమోహన్, సూరి, ప్రసాద్, విష్ణువర్ధన్‌రెడ్డి, ఝాన్సీ, నరసింహ, వినయ్, అశోక్, హరీష్ పాల్గొన్నారు.

తడి,పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

బండ్లగూడ: తడి, పొడి చెత్తను వేరుచేసి ఇవ్వాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వీరభద్ర ఫంక్షన్‌హాల్‌లో ప్రభుత్వ తరఫున ఏర్పాటు చేసిన తడి, పొడి హానికరమైన చెత్త సేకరణపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఎమ్మెల్యే పాల్గొని మాట్లాడారు. ప్రజలు మారినప్పుడే తమ ప్రాంతం, సమాజం మారుతుందని ప్రతి ఒక్కరూ విధిగా చెత్తను వేరు చేసి ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ కార్మికులకు ఇవ్వాలన్నారు. ఈ సదస్సులో మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్, కమిషనర్ శరత్‌చంద్ర, కార్పొరేటర్లు రవీందర్‌రెడ్డి, అస్లాంబిన్ అబ్దుల్లా, సాగర్‌గౌడ్, కోఆప్షన్ సభ్యులు మలాకీ రత్నం, జగదీష్, సీనియర్ నాయకులు గోకరి సురేష్‌గౌడ్, నాగరాజు, గోపాల్‌ముదిరాజ్, అరుణ్, శేఖర్ పాల్గొన్నారు.

అండర్‌పాస్ ఏర్పాటుకు వినతి

శంషాబాద్ రూరల్: బెంగళూరు జాతీయ రహదారి విస్తరణలో భాగంగా మండలంలోని పెద్దషాపూర్ గ్రామ శివారులో స్థానికుల సౌకర్యార్థం ప్రత్యేకంగా అండర్‌పాస్ నిర్మాణం చేపట్టాలని సర్పంచు చెక్కల చంద్రశేఖర్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కలెక్టరు హరీష్, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు వినతిపత్రం అందజేశారు. ఇక్కడ రహదారి దాటే సమయంలో విద్యార్థులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రమాదాలు సైతం జరుగుతున్నాయన్నారు. ఇది వరకు ఇక్కడ ఉన్న కల్వర్టు గుండా రాకపోకలు సాగించే వారని తాజాగా విస్తరణ పనులు కొనసాగుతుండటం, పెద్దషాపూర్ వద్ద వంతెన నిర్మాణం చేపట్టకపోవడంతో చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని విన్నవించారు. వినతి ఇచ్చిన వారిలో లక్ష్మణ్, మానయ్య, గౌస్‌పాషా, సత్యనారాయణగౌడ్, హరి, కృష్ణ, ఉన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

క్వాలిటీ కంట్రోల్ కార్యాలయం ప్రారంభం

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ ఎస్‌బిఆర్‌డీ వద్ద ఏర్పాటు చేసిన పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ క్వాలిటీ కంట్రోల్ కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, శంషాబాద్ ఎంపీపీ జయమ్మశ్రీనివాస్, పంచాయతీ రాజ్ ఈఈ సురేందర్, డీఈ సంజీవ్‌రెడ్డి, ఏఈ యాదగిరిరెడ్డితో కలిసి ప్రారంభించారు.

గుడి స్థలం తేల్చిన తర్వాతే పనులు చేయండి

ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

మణికొండ: ఖానాపూర్ గ్రామంలో ఉన్న రాజన్నగుట్ట దేవాలయానికి అవసరమైన స్థలాన్ని కేటాయించిన తర్వాతే పనులు చేయాలని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ ఆదేశించారు. సోమవారం ఆయన ఖానాపూర్ గ్రామంలో వివాదాస్పదమైన దేవాలయం, వేలం వేసిన భూములను ఆయన మాజీ ఎంపీపీ తలారి మల్లేష్, గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఇది చరిత్రాత్మకమైన దేవాలయమని, దానికి ఎలాంటి రెవెన్యూ రికార్డులు లేకపోవటం, హెచ్‌ఎండీఏ అధికారులు అది చూసుకోకుండా రెవెన్యూ రికార్డుల ప్రకారం ఉన్న భూమిని వేలం వేశారని ఈ సందర్భంగా గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకురాగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని అప్పటి వరకు పనులను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎండీఏ అధికారులు సుభాష్, రాములు, బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ అధ్యక్షుడు ఆర్. నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



ఖానాపూర్ రాజన్నగుట్ట దేవాలయాన్ని సందర్శించిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

- దేవాలయాలు ఉన్న భూమిని సైతం రాష్ట్ర ప్రభుత్వం అమ్మకానికి పెట్టి భక్తులను ఇబ్బందులకు గురిచేస్తుందని, దేవాలయానికి అవసరమైన 5 ఎకరాల భూమిని కేటాయించాల్సిందేనని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు వి.హన్మంత్‌రావు అన్నారు. సోమవారం ఆయన ఖానాపూర్ రాజన్నగుట్టను సందర్శించి దేవాలయం, వేలం వేసిన భూములను పరిశీలించి మాట్లాడారు.

ఉదయ్‌నిధి స్టాలిన్ క్షమాపణ చెప్పాలి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

రాజేంద్రనగర్: హిందూ ధర్మాన్ని అణచివేసేందుకు కొన్ని శక్తులు కుట్రలు చేస్తున్నాయని వాటిని తిప్పికొట్టాల్సిన అవసరం ఉందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ అసెంబ్లీ డైరీ ఫామ్ చౌరస్తాలో రాజేంద్రనగర్ అసెంబ్లీ కన్వీనర్ పోన్నమని మల్లేష్‌యాదవ్ ఆధ్వర్యంలో ఉదయ్‌నిధి స్టాలిన్ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రపంచ దేశాలు మన సనాతన ధర్మాన్ని పాటిస్తుంటే ఇక్కడున్న ఉదయ్‌నిధి స్టాలిన్ లాంటి కొందరు నేతలు తమ రాజకీయ లబ్ధి కోసం ఇలా మాట్లాడడం పద్ధతి కాదన్నారు. ఎవరైనా హిందూ సమాజానికి జోలికొస్తే వారికి పుట్టగతులు ఉండవన్నారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, ఎం.కొమురయ్య, కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, మోండ్ర సంగీత, కాడెం సుధాకర్, బొక్క బాల్‌రెడ్డి, రాచూరి రాజశేఖర్, అడికే రాజు పాల్గొన్నారు.

కాళీమందిర్ చౌరస్తాలో..

బండ్లగూడ: ఉదయనిధి స్టాలిన్ వెంటనే బహిరంగ క్షమాపణలు చెప్పాలని బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఇన్‌చార్జి అంజన్‌కుమార్ అన్నారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ బీజేపీ అధ్యక్షులు మహేష్‌యాదవ్ ఆధ్వర్యంలో కాళీమందిర్ చౌరస్తాలో ఉదయనిధి స్టాలిన్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ కార్యక్రమంలో బీరప్ప, భిక్షపతియాదవ్, మహాలింగంగౌడ్, భూపాల్, ప్రశాంత్‌నాయక్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీజేపీ నాయకులు

ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలి



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు

శంషాబాద్: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలంటూ సోమవారం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలతో మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు అరకొర జీతాలకే పనిచేయాల్సిన దుస్థితిలో ఉన్నామన్నారు. గతంలో క్రమబద్ధీకరిస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ప్రస్తుతం పట్టించుకోవడం లేదన్నారు. మున్సిపాలిటీల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. నిరసనలో బాబురావు, నర్సింహ, మొయినుద్దీన్, దశరథ్, నగేష్, సాయిరాజ్, నరేందర్, రవీ, రమాదేవి పాల్గొన్నారు.

ఉప కమిషనర్‌తో కార్పొరేటర్ సమావేశం

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ కార్పొరేటర్ మోండ్ర సంగీతగౌరీశంకర్ సోమవారం రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రవికుమార్‌తో సమావేశమయ్యారు. ఈ నెల 18వ తేదీన వినాయక చవితి సందర్భంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. వీధిలైట్లు, పారిశుద్ధ్య నిర్వహణ, రోడ్లకు మరమ్మత్తులు తదితర సమస్యలపై చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ నీరు రోడ్లపై పొంగుతుందని వర్షాలకు గోతులమయంగా మారిన రోడ్లకు మరమ్మతులు చేయాలన్నారు.



రవికుమార్‌తో మాట్లాడుతున్న కార్పొరేటర్

విద్యార్థులకు బస్ పాస్‌ల అందజేత



బస్‌పాస్‌లను అందించిన రామకృష్ణారెడ్డి

మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమ వంతు చేయూతనందించి వారిని విద్యతో పాటు అన్ని రంగాలలో ప్రోత్సహిస్తామని మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి అన్నారు. మణికొండ ప్రభుత్వ పాఠశాలకు పరిసరా ప్రాంతాల నుంచి వస్తున్న విద్యార్థులకు సోమవారం ఆయన బస్ పాస్‌లను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బస్ పాస్‌లకు విద్యార్థులు రూ. 50 చెల్లించటం కష్టతరంగా మారిందని ప్రధానోపాధ్యాయుడు మాంగ్యానాయక్ తన దృష్టికి తీసుకురావడంతో 257 మంది విద్యార్థుల డబ్బును తానే చెల్లించాలనన్నారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, విద్యార్థులకు అవసరమైన అన్ని రకాల సౌకర్యాలను అందించేందుకు ముందుంటామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వసంతరావు, బి.శ్రీరాములు, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్, శ్రావణ్, దిలిప్‌కుమార్, శ్రీకాంత్, గంగాధర్, డీపో మేనేజర్ లక్ష్మి, సీఆర్‌సీ ధర్మేందర్ పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం



కలామ్ అవార్డు స్వీకరించిన ప్రొ.కిషోర్



ఐఎన్ఏఈ ఫెలోగా ప్రొ.మాధవకృష్ణ

- ఒకరికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హెచ్‌పీసీ అవార్డు-2023
- మరొకరు ఐఎన్ఏఈ ఫెలోగా ఎంపిక

రాయదుర్గం: ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు ప్రొఫెసర్లకు అరుదైన అవకాశం లభించింది. ప్రొఫెసర్ మాధవకృష్ణ ఇండియన్ నేషనల్ అకాడమీ ఆఫ్ ఇంజనీరింగ్(ఐఎన్ఏఈ) ఫెలోగా ఎంపికయ్యారు. ఇంజనీరింగ్ రంగంలో ముఖ్యంగా టెక్నాలజీలో వస్తున్న మార్పులపై ఆయనకున్న అవగాహన, అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రొఫెసర్ మాధవ కృష్ణను ఎంపిక చేశారు.

ప్రొఫెసర్ కిషోర్‌కు డా.కలామ్ అవార్డు

ట్రిపుల్‌ఐటీ ప్రొఫెసర్ కిషోర్ కొత్తపల్లికి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలామ్ హెచ్‌పీసీ అవార్డు-2023కి ఎంపికయ్యారు.ముఖ్యంగా అల్గోరిథమ్ ఇంజనీరింగ్ టెక్నిక్స్ రంగంలో ఆయనకున్న ప్రతిభ, అనుభవాన్ని గుర్తించి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేశారు. వీరిని పలువురు ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ ప్రొఫెసర్లు, అధ్యాపకులు అభినందించారు.

చదువుతోపాటు నైపుణ్యం తప్పనిసరి

రాయదుర్గం: విద్యార్థి దశలోనే నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని ఆర్గానిక్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంఏ రషీద్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని ఇంజనీరింగ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియాలోని స్కూల్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ స్టడీస్ ఆధ్వర్యంలో పీజీడీఎం 2023-25 బ్యాచ్ విద్యార్థులకు ఒక రోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని సోమవారం సాయంత్రం ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ జి రామేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో రషీద్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి భవిష్యత్తు లక్ష్యాలను నిర్ధారించుకొని వాటిని సాధించేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలని సూచించారు. చదువుతోపాటు 21వ శతాబ్దానికి అవసరమైన నైపుణ్యాలను నేర్చుకోవడంపై ప్రతి విద్యార్థి దృష్టి పెట్టాలన్నారు. ఐటీసీ జీఎం(రిటైర్డ్) కేజేఏ స్వరూప్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తాము చదివే అంశంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తేనే రాణించే అవకాశం ఉంటుందన్నారు. ఎస్కీ డైరెక్టర్ డాక్టర్ రామేశ్వరరావు మాట్లాడుతూ ఎస్కీకి నాలుగు స్థంభాలైన శిక్షణ, పరిశోధన, కన్సల్టెన్సీ, ఎస్‌పీజీఎస్ అంశాలపై వివరించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఏ జగన్‌మోహన్‌రెడ్డి, లక్ష్మీకాంతరావు, ఎం సింధూ, కెఎస్‌రావు, చాయాపద్మ, పీజీడీఎం విద్యార్థులు పాల్గొన్నారు.

27 టన్నుల రేషన్ బియ్యం స్వాధీనం

ముగ్గురు అరెస్ట్

గచ్చిబౌలి: హైదరాబాద్ నుంచి మహారాష్ట్రకు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని రాయదుర్గం పోలీసులు పట్టుకున్న సంఘటన సోమవారం చోటు చేసుకుంది. ఎస్ఐ శ్రీనివాస్ కథనం ప్రకారం .. చాదర్‌ఘాట్‌లో రేషన్ బియ్యాన్ని లోడ్ చేసుకొని మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలించేందుకు పంపిస్తుండగా విశ్వసనీయ సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు నానక్‌రాంగూడ వద్ద లారీని ఆపి తనిఖీ చేసి స్వాధీనం చేసుకున్నారు. అందులోని 27 టన్నుల బియ్యం, డ్రైవర్ సయ్యద్ సజ్జాద్(32) క్లీనర్ మహ్మద్ నౌమాన్, పైలట్ నహీమ్‌లను అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

దీప్తిశ్రీనగర్‌లో గడపగడపకూ బీజేపీ

మియాపూర్: ప్రతి అడుగు రేపటి మార్పుకోసమేనని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ అన్నారు. గడపగడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా రవికుమార్ చేపట్టిన ప్రజాయాత్ర 90వ రోజుకు చేరుకుంది. చందానగర్ డివిజన్ దీప్తిశ్రీనగర్‌లో రవికుమార్ యాదవ్, కన్వీనర్ రాఘవేంద్రరావు, మాజీ కార్పొరేటర్ నవతారెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ సింధురెడ్డి, నాగుల్‌గౌడ్, కాలనీ అధ్యక్షులు సత్యనారాయణలతో కలిసి పాదయాత్ర చేశారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బీబీరావు, కనకదుర్గ, సూర్యనారాయణ, సుధాకర్, రమణకుమారి, అనిల్‌కుమార్, అజయ్‌యాదవ్, మహమ్మద్‌గౌస్, అర్జున్ తదితరులున్నారు.

విలువలతో కూడిన విద్యా బోధన అవసరం

రాయదుర్గం: విలువలతో కూడిన విద్యా బోధన అవసరాన్ని అధ్యాపకులంతా గుర్తించాలని సంగారెడ్డి జిల్లా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ జి నారాయణ సూచించారు. గచ్చిబౌలిలోని మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలోని యూజీసీ-హెచ్‌ఆర్‌డీసీలో వారం రోజుల పాటు నిర్వహించిన స్వల్పకాలిక కోర్సు శిక్షణా కార్యక్రమం ముగిసింది. ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపకులలో లింగ సున్నితత్వాన్ని పెంపొందించడానికి , లింగ హింసపై విమర్శనాత్మకంగా ప్రతిబింబించే ఈ కార్యక్రమం యూజీసీ తీసుకున్న చొరవలోఒక భాగమన్నారు. కార్యక్రమంలో 'మనూ' యూజీసీ హెచ్‌ఆర్‌డీసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సనీమ్ ఫాతిమా, హెచ్‌సీయూ, టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్, ఉర్దూ విశ్వవిద్యాలయానికి చెందిన రిసోర్స్‌పర్సన్లు తమ అభిప్రాయాలను వివరించారు. శిక్షణా కార్యక్రమంలో తెలంగాణ, మహారాష్ట్ర, కర్నాటక రాష్ట్రాలకు చెందిన 21 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

సమన్వయంతో పనిచేయాలి

- ఇన్సిడెంట్ ఫ్రీగా చవితి వేడుకలు చేసుకోవాలి
- సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర

రాయదుర్గం: గణేష్ వేడుకల్లో అన్ని శాఖల అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర సూచించారు. రానున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల ఏర్పాట్ల నిర్వహణ, భద్రతకు సంబంధించిన అంశాలపై గచ్చిబౌలిలోని సైబరాబాద్ కమిషనరేట్‌లో పోలీసు అధికారులు, జీహెచ్‌ఎంసీ, జలమండలి, టీఎస్ఎస్‌పీడీసీఎల్, అగ్నిమాపక శాఖ, నీటిపారుదల, రోడ్లు, భవనాలు, మెడికల్ అండ్ హెల్త్ శాఖ, రెవిన్యూ, పంచాయతీరాజ్, మున్సిపల్, పరిపాలనా విభాగం శాఖ అధికారులు, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి(బీజీయూఎస్) ప్రతినిధులతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 18వ తేదీన ప్రారంభమై 28వ తేదీ వరకు కొనసాగే గణేష్ చతుర్థికి ఈ ఏడాది 1200 విగ్రహాల ప్రతిష్ట ఉండొచ్చని అన్నారు. నిమజ్జనం జరిగే చెరువుల వద్ద ముఖ్యంగా చిన్నారులు, మహిళలు, వృద్ధులకు ఇబ్బందులు తలెత్తకుండా జీహెచ్‌ఎంసీ సిబ్బంది, ట్రాఫిక్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. డయల్ 100కు వచ్చే కాల్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రంగారెడ్డిజిల్లా అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్ మాట్లాడుతూ అన్ని శాఖలతో సమన్వయం చేసుకుంటూ పనిచేస్తామన్నారు. సైబరాబాద్ అదనపు సీపీ అవినాష్ మహంతి, ట్రాఫిక్ జాయింట్ సీపీ నారాయణ్‌నాయక్, డీసీపీలు, ఏడీసీలు, బీజీయూఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ భగవంత్‌రావు, నర్సింగ్‌పూరి, అధికారులు పాల్గొన్నారు.

హెచ్‌సీయూను సందర్శించిన ఇండోనేషియా బృందం

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీని ఇండోనేషియా బోగోర్‌లోని ఐపీబీ విశ్వవిద్యాలయం ప్రతినిధి బృందం సోమవారం సందర్శించింది. ఇండోనేషియాలోని బోగోర్‌లోని ఐపీబీ యూనివర్సిటీకి చెందిన రీసెర్చ్ అండ్ ఇన్నొవేషన్ వైస్ రెక్టార్ ప్రొఫెసర్ ఎర్నాన్ రస్టియాడి, ప్లాంట్ ఎకాలోజిస్ట్, సైకాలజిస్ట్ ప్రొఫెసర్ ఎ డిసంతోషా, ఐకార్-క్రెడా లైజాన్ ఆఫీసర్ డాక్టర్ భరత్ కె ఆలమ్‌తో కూడిన బృందం వీసీ బీజేరావుతో సమావేశమయ్యారు. ముఖ్యంగా రెండు సంస్థల మధ్య సహకారంపై చర్చించారు. వీసీ ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ సంస్కృతి వారసత్వం, చరిత్రకు సంబంధించి దేశాల మధ్య ఉన్న సారుప్యతలను వివరించారు. విద్యార్థులు, అధ్యాపకులకు ప్రయోజనం చేకూర్చే విధంగా రెండు విశ్వవిద్యాలయాల మధ్య సహకారాన్ని విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు.

ఐపీబీ విశ్వవిద్యాలయం ప్రతినిధుల బృందం మాట్లాడుతూ ఇండోనేషియాలో ఐపీబీ విశ్వవిద్యాలయం అతిపెద్ద మొదటి వ్యవసాయ విశ్వవిద్యాలయమని పేర్కొన్నారు. స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ డీన్ ప్రొఫెసర్ ఎస్ శివకుమార్, ప్లాంట్ సైన్సెస్ విభాగాధిపతి ప్రొ.రాజగోపాల్, ఐఓఈ డైరెక్టర్ ప్రొఫెసర్ ఘనశ్యామ్ కృష్ణ, ఆర్ అండ్ డీ సెల్ డైరెక్టర్ సామ్రాట్ ఎల్ సబత్, ఓఐఏ అసోసియేట్ డైరెక్టర్, స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ ఫ్యాకల్టీ ప్రొఫెసర్ అలోక్ కుమార్ మిశ్రా పాల్గొన్నారు.

ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించాలి



రాజేంద్రనగర్ పత్తికుంటను సందర్శించిన డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

రాజేంద్రనగర్: గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి వెల్లడించారు. గణేష్ ఉత్సవాలను పురస్కరించుకుని సోమవారం రాజేంద్రనగర్ పత్తికుంటను ఏసీపీ గంగాధర్, సీఐ నాగేంద్రబాబు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులతో కలిసి ఆయన సందర్శించిన అనంతరం మాట్లాడారు. ప్రజలంతా పండుగలను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉత్సవ కమిటీ సభ్యులు పర్యవేక్షించాలన్నారు. ఈ కార్యక్రమంలో వై.శ్రీధర్, మల్లారెడ్డి, ఇంద్రపాల్‌రెడ్డి, రామేశ్వర్, రవి, బాల్‌రెడ్డి, బాబురావు, వెంకోబా, ఎలక్ట్రిసిటీ ఏఈ హాతిరాం, జగన్, రాజు, వినోద్, రాజు, కుమార్ పాల్గొన్నారు.

మెరుగైన వసతుల కల్పనకు కృషి

మైలార్‌దేవ్‌పల్లి: ప్రజలకు మెరుగైన వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం మధుబన్ కాలనీ, టీఎన్‌జీవోస్ కాలనీలో ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులు, నాయకులతో కలిసి పర్యటించారు. భూగర్భ డ్రైనేజీ పైప్‌లైన్, నూతన సీసీ రోడ్డు కోసం అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. డివిజన్ వాసులకు నిత్యం అందుబాటులో ఉంటూ వారికి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. డివిజన్ పరిధిలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, ఉత్తమ, రాజేష్, కృష్ణారెడ్డి, ఉదయ్‌రావు, వర్ధన్‌రెడ్డి, రావుల భాస్కర్, చిన్న, బబ్లూ పాల్గొన్నారు.



డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

రోడ్లపై రూ.500 నోట్లు..

రాయదుర్గం: రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు తెలంగాణ పోలీసులు సైబర్ సెక్యూరిటీ బ్యూరో ద్వారా వినూత్న ప్రచారాన్ని ప్రారంభించారు. పలుచోట్ల రూ.500 నోటుతో కూడిన పర్సులను రోడ్లపై ఉంచారు. నడిచివెళ్లేవారు చేతిలోని బ్యాగు, ఇతర వాటిని పక్కన పెట్టి దాన్ని తీసుకునే సమయంలో వాటిని కొట్టేసేలా దొంగలు యత్నం చేస్తున్నారు.

సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన

ఈ క్రమంలో సైబరాబాద్ పరిధిలో రద్దీ ప్రాంతాలలో రూ.500 నోట్లు ఉన్న పర్సును రోడ్డుపై ఉంచుతున్నారు. ప్రజలు పర్సు అనుకుని తెరిచి చూస్తే సైబర్ నేరాలపై 1930కు కాల్ చేయాలని సమాచారం ఉంచారు. అసలు నకిలీ మధ్య తేడాలు గుర్తించాలని, ఆశపడకుండా.. అప్రమత్తంగా ఉండాలనే సందేశమున్న పేపర్లతో ఆ దిశగా ప్రచారం చేస్తున్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9553955684
9010221230